నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | మంగళవారం 14 నవంబర్ 2023 www.ntnews.com

మొద్దబ్బాయిలతోని తిరుగొద్దని
శుంఠల సోపతి పట్టొద్దని
అబద్ధాలు, చాడీలోళ్ల చెంతకు చేరొద్దని
గోల్‌మాల్ గాళ్ల వలలో చిక్కొద్దని
అసలు అసంటోళ్లను నమ్మవద్దని
మన బాల్యంలో అమ్మ, బాపు
గడికీ పైలం పలికెటోళ్లని జ్ఞప్తికి వస్తున్నయి కదూ!
మరి రేటెంతరెడ్డి వెంట తిరుగొద్దని
ఆ నీడ, పాడ పడితే ఉన్న ఇంత ఇజ్జత్ పోతుందని
ఏది చెబితే అది గుడ్డిగ ఇని నోరు జారొద్దని
రాహుల్ గాంధీకి ఎవరు చెప్పాలె?

-ఇల్లెందుల దుర్గాప్రసాద్

91827 77222

హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు పంపడం మర్చిపోకండి.

ఫన్‌టాస్టిక్

ప్రీ లాంచ్@ రాచకొండ!

'ఏంటి సార్ దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? పోలింగ్ తేదీ సమీపిస్తుంటే ఆలోచనలు ఏమిటీ?'

'నాకు రియల్ ఎస్టేట్ బాగా కలిసొచ్చింది. గోడలకు రాతలు రాయడం నుంచి హస్తం పార్టీలో నాయకుల తలరాతలు రాసే స్థితికి నన్ను తెచ్చింది అదే కదా?'

'ఇందులో అనుమానం ఏముంది సార్. కాంగ్రెస్ నేతల రాతలే కాదు. కాంగ్రెస్ తలరాత చెరిపే స్థితిలో ఉన్నారు మీరు. ఇంత చిన్న వయసులో అంత పెద్ద సైకిల్ తలరాత చెరిపేసి, ఇప్పుడు హస్తం రేఖలు రూపుమాపే స్థానంలో ఉండటం అంటే మామూలా. ఇంతకూ దీర్ఘ ఆలోచనకు కారణం చెప్పలేదు?'

'రియల్ ఎస్టేట్‌లో ప్రీ లాంచింగ్ ఆఫర్ తెలుసు కదా?'

'తెలుసు. అది ఇల్లీగల్..'

'ఇల్లీగల్లోనే ఆదాయం ఎక్కువ. మీరు గుర్తించలేదు కానీ నేను ఎప్పుడో పార్టీలో ప్రీ లాంచింగ్ ఆఫర్ అమలు చేశాను.'



'ఎలా? ఎప్పుడు?'

'టికెట్లు అమ్ముకున్నాడు అని అంతా గోల చేస్తుంటే అర్థం కాలేదా. ఆ స్కీంలో భాగంగానే ఎప్పటి నుంచో ప్రీ లాంచింగ్ అమలు చేశా.

'అమ్మో మీరు కనిపించేంత మామూలు కాదు. ప్రీ లాంచింగ్ ఆఫర్‌తో బాగానే గిట్టుబాటు అయినట్టు ఉంది. డబ్బులకు టికెట్లు అమ్ముకున్నారని భాగ్యలక్ష్మీ ఆలయం వద్ద తడి బట్టల ప్రమాణాలు, మీడియా ముందు గోలతో పరువు పోయిందికదా?'

'పరువుదేముంది. ఎంత కరెన్సీ వచ్చింది అని చూడాలి కానీ. డబ్బు వస్తే పరువు దానంతట అదే వస్తుంది.'

'మరి ఆ ఆలోచన?'

'ప్రీ లాంచింగ్ ఆఫర్‌తో బాగానే వచ్చింది కానీ, ఇంతకన్నా ఎన్నో రెట్లు వచ్చే ఐడియా ఉంది.'

'ఏంటి సార్ అది?'

'అమరావతి రాజధాని అని ఎక్కడా ముందు తెలియనివ్వకుండా వేల ఎకరాల భూమి కొనిపించారు.'

'అవును కొన్నవాళ్ళు అంతా లబోదిబోమంటున్నారు.'

'అన్ని ప్రీ లాంచ్ ఆఫర్‌లు సక్సెస్ అవుతాయని కాదు. కొన్ని భవనాలు నిర్మాణం కావు. 'రియల్' లో ఇవి మామూలే. కానీ అమరావతిని రివర్స్‌లో మనం అమలు చేస్తాం.'

'అలా ఎలా?'

'అమరావతి రాజధాని అని చివరి వరకు దాచి పెట్టి తమ వాళ్లతో కొనిపించి ఇదే రాజధాని అన్నారు. కానీ మనం రాచకొండను కొత్త నగరం అని ముందే చెప్పి ప్రీ లాంచింగ్‌లో అమ్మేద్దాం. అంటే నేను అధికారంలోకి రాగానే రాచకొండలో మహానగరం నిర్మిస్తే, అందులో వేలకోట్ల ఆదాయం ఇచ్చే భూములు మీకే. దాని కోసం మీరు ముందే ఎన్నికలప్పుడు నాకు డబ్బుల మూటలు ఇవ్వాలి అని చెబుతాం.'

'మీరు గెలవకపోతే ?'

'రియల్ ఎస్టేట్ వ్యాపారం గురించి నీకు ఇంత కూడా అవగాహన లేదు. అధికారంలోకి రాకపోతే ఏమవుతుంది. ప్రీ లాంచింగ్‌లో ఫ్లాట్స్ అమ్మేశాక బిల్డింగ్ కట్టకపోతే ఏమవుతుందో రాచకొండ ప్రీ లాంచింగ్‌కు డబ్బుల మూటలు ఇచ్చిన వారిదీ అదే అవుతుంది. ఎటు చూసినా నాకు లాభమే.. కదా?

■ మురళి

నాడు-నేడు

• అధ్వానపు గూళ్లు..

ఎవరికి పట్టింది పేదల గోడు. ఆకలిని పట్టించుకోలేదు. అవసరాలను గుర్తించలేదు. ఆఖరికి బతకడానికి గూడు కావాలయ్యా... అని అడిగితే కిళ్లీ కొట్టు కన్నా చిన్న ఇండ్లు కట్టించి జబ్బలు చరుచుకున్నారు ఆనాటి పాలకులు. ఇరుకు వీధుల్లో అగ్గిపెట్టెల్లాంటి నాలుగు ఇండ్లు కట్టించి ఇంద్రప్రస్థం నిర్మించామని డాబులు పలికారు. ఆనాటి నాయకుల నయవంచనకు నిలువుటద్దం తెలంగాణ రాకమునుపు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని అంబేద్కర్ నగర్ కాలనీ.

• ఆత్మగౌరవ ప్రతీకలు

అదే అంబేద్కర్ నగర్ ఇప్పుడు ఆత్మగౌరవానికి చిరునామాగా నిలిచింది. పేదవాడి ఇల్లు అంటే ఆరడుగుల గచ్చు కాదు.. ఐదు అంతస్తుల సుందర భవనం అని నిరూపించిన వైనమిది. నిరుపేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కన్న కలలు వాళ్ల కండ్లముందు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను సాక్షాత్కరింపజేశాయి. రూ.28 కోట్లతో 330 డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లను నిర్మించి అర్హులకు బీఆర్ఎస్ సర్కారు కానుకగా ఇచ్చింది.

దుద్దిళ్ల.. దగా చేసిండు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే మంథనికి మంచిరోజులు

- మంత్రిగా పనిచేసినా మంథని కష్టాలు తీర్చలే
- అభివృద్ధిని మరిచిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- దశాబ్దాల సమస్యలను పరిష్కరించిన పుట్ట మధు

దుద్దిళ్ల కుటుంబానికి మంథని ప్రజలు నాలుగు దశాబ్దాల పాటు అండగా నిలిచారు. శ్రీధర్‌బాబును నాలుగుసార్లు, ఆయన తండ్రి శ్రీపాదరావును మూడుసార్లు గెలిపించి రాజకీయ జీవితాన్ని ప్రసాదించారు. కాంగ్రెస్ హయాంలో శ్రీధర్‌బాబు పదేండ్ల పాటు అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగారు. ప్రభుత్వ విప్, మంత్రిగా కూడా పనిచేశారు. ఈ అవకాశాలతో తమకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన మంథనిని అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకోవాలి. కానీ, ఆయన ఎన్నడూ ఈ ప్రయత్నం చేయలేదు.

2014లో బీఆర్ఎస్ గెలిచాకనే మంథనికి మంచిరోజులు వచ్చాయి. కేసీఆర్ హయాంలోనే దశాబ్దాల సమస్యలు పరిష్కారమయ్యాయి. వెనుకబాటు పోయి అభివృద్ధి మొదలయ్యింది. ఎమ్మెల్యే పుట్ట మధు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకువచ్చారు. అనేక గ్రామాలకు రోడ్లు వేశారు. బస్సు సౌకర్యాన్ని కల్పించారు. వందల కోట్ల రూపాయలతో వంతెనలు నిర్మించారు. ప్రపంచానికి వెలుగులు నింపడం కోసం సర్వస్వం కోల్పోయిన సింగరేణి నిర్వాసితులకు పరిహారం ఇప్పించారు. పునరావాసం కల్పించారు.

మంథని మాట

మంథనిలో బొక్కలవాగుపై నిర్మించిన రెండు వంతెనలు

ప్రతి ఎన్నికల ముందు మంథని ప్రజలకు హామీలు ఇవ్వడం, గెలిచాక మరిచిపోవడం దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అలవాటు. ఇరవై ఏండ్ల పాటు ఎమ్మెల్యేగా పనిచేసి ఆయన చేసింది శూన్యం. ఆయన నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అనేక గోస పడ్డారు. కనీస మౌలిక సదుపాయాలకు కూడా ఇక్కడి ప్రజలు నోచుకోలేదు. వంతెనలు లేక అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. సింగరేణి నిర్వాసిత గ్రామాల ప్రజల కష్టాలు అయితే అన్నీఇన్నీ కావు. 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యే వరకు మంథని సమస్యల కూపమై, అభివృద్ధికి దూరంగా ఉండేది. పుట్ట మధు ఎమ్మెల్యేగా గెలిచాక సమస్యలు పరిష్కారమయ్యాయి. శ్రీధర్ బాబు హామీలు ఇచ్చి ఇరవై ఏండ్ల కాలయాపన చేసినవి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చింది.

హామీలకే శ్రీధర్‌బాబు పరిమితం

ఎన్నికల్లో గెలువడానికి మంథని ప్రజలకు శ్రీధర్‌బాబు అనేక హామీలు ఇచ్చేవారు. ప్రజల చిరకాలవాంఛ మర్రివాగు ప్రాజెక్టు నిర్మిస్తానని హామీ ఇచ్చి వదిలేశారు. మల్హార్ మండలం పెద్దతూండ్ల గ్రామ పరిధిలోని తీగలవాగు ప్రాజెక్టును శ్రీధర్‌బాబు హయాంలో నిర్మిస్తే ఏడాదికే తెగిపోయింది. అప్పటి నుంచి మళ్లీ ఈ ప్రాజెక్టు మరమ్మతులు చేయించలేదు. నియోజకవర్గంలోని అటవీ గ్రామాలను అనుసంధానం చేసి రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు 20 వంతెనలతో నిర్మించ తలపెట్టిన 108 కిలోమీటర్ల రహదారి పనులు ముందుకు సాగలేదు.

బీఆర్ఎస్ హయాంలోనే తీరిన కష్టాలు

రోడ్డు సదుపాయం లేక అనేక గ్రామాలకు ఎర్రబస్సు కూడా వెళ్లలేని దయనీయ పరిస్థితులను మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం కేసీఆర్ పెద్దఎత్తున నిధులు కేటాయించారు. పెద్దపల్లి-కాటారం, కాటారం టూ కాళేశ్వరం, కాటారం-మహాముత్తారం, కొయ్యూర్- తాడిచర్ల , మంథని -ముత్తారం, నాగేపల్లి-ముత్తారం ప్రధాన రహదారులను డబుల్ రోడ్లు చేస్తామని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చి వదిలేస్తే కేసీఆర్ ప్రభుత్వం నెరవేర్చింది. అనేక వంతెనలు నిర్మించారు. కేంద్రం, రాష్ట్రంలో పదేండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా రోడ్ల నిర్మాణానికి అవసరమైన అటవీ శాఖ అనుమతులను శ్రీధర్‌బాబు తీసుకురాలేకపోయారు. పుట్ట మధు స్వయంగా ఢిల్లీ వెళ్లి అన్ని అనుమతులు పొంది పనులు పూర్తి చేయించారు.

సింగరేణి నిర్వాసితులకు న్యాయం..

నియోజకవర్గంలోని పూర్వపు కమాన్‌పూర్, మంథని మండలాల్లో సింగరేణి గనులు క్రమంగా విస్తరించడంతో అనేక గ్రామాలు నిర్వాసిత గ్రామాలుగా మిగిలిపోయాయి. అప్పటి ఎమ్మెల్యే పుట్ట మధు అసెంబ్లీలో ఈ విషయాన్ని లేవనెత్తారు. ప్రపంచానికి వెలుగులు నింపడం కోసం సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. దీంతో ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేసింది. అందరికీ పరిహారం ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పించింది.

ద లీడర్..

పేదల బతుకుల్లో మెతుకు

పేదింటి విద్యా కుసుమం.. సేవలో పెద్ద మనస్తత్వం

సబితాఆనంద్ ఫౌండేషన్ పేరిట ప్రజాసేవ

ఇద్దరు మాజీ మంత్రులను మట్టికరిపించిన ఘనత

వికారాబాద్ అభివృద్ధిలో తనదైన ముద్ర

పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన రాష్ట్రంలోనే తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. చిన్నతనం నుంచే చదువుల్లో ముందుండి పేదరికాన్ని జయించారు. వైద్య విద్యను అభ్యసించారు. డాక్టర్‌గా ప్రజాసేవ చేశారు. నాయకుడిగా ప్రజలకు సేవచేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చారు. తన వాక్చాతుర్యంతో అందరినీ ఆకట్టుకునే తత్వం. అంచెలంచెలుగా అందనంత ఎత్తుకు ఎదిగారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్నారు. ప్రత్యర్థులుగా ఉన్న ఇద్దరు మాజీ మంత్రులను మట్టి కరిపించి చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.

వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం కెరెల్లిలో పుట్టి పెరిగిన డాక్టర్ మెతుకు ఆనంద్ పేద కుటుంబం నుంచి వచ్చారు. ఎంసెట్ రాసి ఫ్రీ సీటు సాధించి గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు. ఎండీ, ఎంఎస్ వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని ఓ నర్సింగ్‌హోంలో ప్రాక్టీస్ చేసి, సొంత ప్రాంతానికి సేవ చేయాలనే ఉద్దేశంతో వికారాబాద్‌లో ఆసుపత్రి ప్రారంభించారు. ఇప్పటివరకు 25 వేలకుపైగా సర్జరీలు చేసి, పేద ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

సబితాఆనంద్ ఫౌండేషన్‌తో సేవలు..

ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి సబిత కూడా వైద్యురాలు. సబితాఆనంద్ ఫౌండేషన్‌ను నెలకొల్పారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిరుపేదలు, అనాథలకు భోజనం, పండ్లు, దుప్పట్లు తదితర సదుపాయాలు కల్పించారు. కరోనా సమయంలో నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. నిరుద్యోగులకు గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 4 తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. వారికి అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు.

కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి..

డాక్టర్ మెతుకు ఆనంద్ రాజకీయాల్లోకి రావాలనే ఆకాంక్షకు 2009లో బీజం పడింది. అప్పటి అసెంబ్లీ ఎన్నికల్లో తన రెండో బావమరిది ప్రసన్నకుమార్ అలంపూర్ నుంచి పోటీ చేసి 600 ఓట్లతో ఓడిపోయారు. ఆ సమయంలో డాక్టర్ ఆనంద్‌తోపాటు ఆయన సతీమణి పిల్లలతో వెళ్లి అలంపూర్‌లో ప్రచారం చేశారు. అయితే చాలా తక్కువ ఓట్లతో ఓడిపోవడం వారి కుటుంబ సభ్యులందరినీ కలిచివేసింది. అయితే వారి కుటుంబంలో సివిల్ సర్వెంట్, డాక్టర్లు ఉన్నారు కానీ రాజకీయ నాయకుడు ఎందుకు ఉండొద్దు అనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చారు. 2013లో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

'మీతో నేను'తో జనంలో ఒకడిగా..

2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీచేసి ఇద్దరు మాజీ మంత్రులను ఎన్నికల్లో మట్టి కరిపించి విజయకేతనం ఎగురవేశారు. ఈ ప్రాంత ప్రజల గొంతును అసెంబ్లీలో వినిపించారు. భారీగా నిధులు తీసుకువచ్చారు. 'మీతో నేను' కార్యక్రమంతో ప్రజల్లో ఒకడిగా ఉంటున్నారు. జూనియర్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీతోపాటు ప్రభుత్వ మెడికల్ కాలేజీని తీసుకువచ్చి జిల్లా ప్రజలతో శభాష్ అనిపించుకున్నారు. ఆయుష్ ఆసుపత్రి, సెంట్రల్ డ్రగ్ స్టోర్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ఆర్వోబీ బ్రిడ్జి, మోమిన్‌పేట్‌లో 1,100 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమల యూనిట్ మొబిలిటీ వ్యాలీని తీసుకువచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ. 3వేల కోట్లను ఖర్చు చేశారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

సామాన్యుల మాట

న్యాయాన్ని బతికించాడు

న్యాయవాదులు బాగా సంపాదిస్తారని చానామంది అనుకుంటరు. నిజం అట్లుండదు. వందల పది మందికే మంచిగ పైసలొస్తయి. మిగతా తొంబైమందిదీ పేద బతుకే. వీళ్ల గురించి ఇంతకముందు పలినోళ్లు పట్టించుకోలే. కేసీఆర్ వచ్చినాంకనే మా బతుకులు మారినయి. లాయర్ల పేదరికాన్ని అర్థం చేసుకొని, వాళ్లకు సాయం జేయాల్నని తెలంగాణ గవర్నమెంట్ మా కోసం సంక్షేమ నిధి పెట్టింది. ఆ పైసలు మా ఆరోగ్యం, సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నరు.

లాయర్లకు హెల్త్ కార్డులు ఇచ్చిన్రు. కరోనా టైంల చానా ఇబ్బంది పడ్డ. రెండు రోజులైతే ఇగ బతుకుడు కష్టమే అన్నట్టుంది. అప్పుడు కోర్టులు నడువలె. ఆదాయం లేకుండె. దవాఖానల జేరిన. ఉన్న డబ్బులన్నీ అయిపోయినయ్. అప్పుడు హెల్త్ కార్డు ఆదుకున్నది. నేను బతికి బయటపడ్డ. నేనే కాదు నాలాంటి లాయర్లెంతోమందికి ఈ హెల్త్‌కార్డులు మేలు చేశాయి. మునుపు ఏదన్నా పెద్ద రోగమొస్తె ఏడాది సంపాదన దవాఖానకే పోతుండె. అట్ల ఇబ్బందిపడ్డ చానా మందిని చూసిన. ఇప్పుడా పరిస్థితి లేదు. కరోనా వచ్చినప్పుడు వంద మంది దాంకా హెల్త్ కార్డుని ఉపయోగించుకున్నరు. నలుగురి లాయర్లకు పెద్ద జబ్బు వస్తే, యాక్సిడెంట్ అయితే ఆపరేషన్‌కు అక్కరకొచ్చింది. లాయర్లలో పేదలుంటరని, వాళ్లను పట్టించుకోవాల్నని పెద్దమనసుతోని కేసీఆర్ న్యాయవాదుల సంక్షేమ నిధిని తీసుకొచ్చి దేశంలనే ఒక ఆదర్శవంతమైన పథకాన్ని పెట్టిండు. మేము కృతజ్ఞతలు చెప్పుడే కాదు ఆయనకు రుణపడి ఉంటం.

- నాటకశాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి, సంగారెడ్డి జిల్లా కోర్ట్, బార్ అసోసియేషన్